# విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు

సుబేదారి,డిసెంబర్ 2 : రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల లెక్కింపు ఫలితాల సందర్భంగా వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఎన్నికల ఫలితాల వెలువడుతున్న సందర్భంగా వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఫలితాలు వెలువడిన తర్వాత ఎక్కడా ఎవరూ పటాకులు పేల్చడం కానీ, డీజే ర్యాలీలు నిర్వహించడం చేయవద్దని తెలిపారు. గుంపులు, గుంపులుగా గుమికూడవద్దని సీపీ సూచించారు. ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులు, ఓడిన అభ్యర్థులు సమన్వయంతో పోలీసులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు కమిషనర్ హెచ్చరించారు.

- ఎన్నికల నిబంధనలు అందరూ పాటించాలి
- పోలీసులకు అన్ని పార్టీలు సహకరించాలి
- వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా
- కౌంటింగ్ కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు తీసుకెళ్లొద్దు..
- మామునూర్ ఏసీపీ సతీశ్‌బాబు

### కౌంటింగ్ కేంద్రాల్లోకి సెల్ ఫోన్ అనుమతి లేదు

ఎనుమాముల మార్కెట్ యార్డ్‌లో ఓట్ల లెక్కింపు సందర్భంగా ఓట్ల లెక్కింపు సిబ్బంది, ఎమ్మెల్యే అభ్యర్థులు, ఏజెంట్లకు సెల్‌ఫోన్ వినియోగించే అనుమతి లేదని మామునూర్ అసిస్టెంట్ కమిషనర్ సీ సతీశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ సిబ్బంది ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద సెల్‌ఫోన్ల పెట్టి, కౌటింగ్ హాల్‌కు వెళ్లాలని ఏసీపీ కోరారు. మీడియా ప్రతినిధులు, కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు ఎనుమాముల మార్కెట్ యార్డ్ మొదటి గేట్ నుంచి మాత్రమే లోపలికి రావాలని సూచించారు. ఆదివారం మార్కెట్‌లోకి సామాన్య ప్రజలకు అనుమతి లేదని, మొగిలిచెర్ల వైపు వెళ్లేవారు కాశీబుగ్గ 100 ఫీట్ల రోడ్డు నుంచి, నర్సంపేట రోడ్డు నుంచి వెళ్లాలని ఏసీపీ కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి నన్నపునేని నరేందర్

## 'తూర్పు'లో గులాబీ జెండా ఎగరడం పక్కా

గిర్మాజీపేట, డిసెంబర్ 2 : తూర్పు నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరడం పక్కా అని ధీమా వ్యక్తం చేస్తూ.. అందరూ సంబురాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉండాలని బీఆర్ఎస్ అభ్యర్థి నన్నపునేని నరేందర్ అన్నారు. శనివారం సాయంత్రం ఆయన పలు డివిజన్ల కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో కలిసి 33వ డివిజన్ రాజశ్రీగార్డెన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో తన గెలుపు కోసం రెండు నెలలుగా కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానని తెలిపారు. తనకు మద్దతు తెలిపిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, మహిళా నాయకులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ తాటికొండ రమేశ్

## పుస్తక సమీక్షతో సద్విమర్శనా దృక్పథం

### కేయూ వీసీ తాటికొండ రమేశ్

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 2 : పుస్తక సమీక్షతో విద్యార్థుల్లో సద్విమర్శనా దృక్పథం అలవడుతుందని కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య తాటికొండ రమేశ్ అన్నారు. విశ్రాంత తెలుగు ఆచార్యులు, కవిరాజ హంస ఆచార్య అనుమాండ్ల భూమయ్య రచించి, సంపాదకీయం చేసిన 'భౌమ మార్గ విమర్శ, తెలంగాణ కవితా వైభవం, సమగ్ర సాహిత్య గేయ కావ్యాలు, భూమయ్య పద్య కావ్యాలు' అనే పుస్తకాలను తెలుగు విభాగాధిపతి ఆచార్య బన్న అయిలయ్యతో కలిసి వీసీ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ రమేశ్ మాట్లాడుతూ విద్యార్థులు తమ పాఠ్యపుస్తకాలతో పాటు విమర్శనాత్మక విషయాలు, గేయాలు, పద్యాలు, కావ్యాలను చదవాలన్నారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని, అన్ని రకాల పుస్తకాలపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టీ శ్రీనివాసరావు, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య పీ మల్లారెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థినులకు చట్టాలపై అవగాహన ఉండాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం కృష్ణమూర్తి

హనుమకొండ, డిసెంబర్ 2 : విద్యార్థినులకు చట్టాలపై తప్పకుండా అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం కృష్ణమూర్తి అన్నారు. శనివారం హనుమకొండలోని కాకతీయ మహిళా డిగ్రీ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి జే ఉపేందర్‌రావు అధ్యక్షతన జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సుకు కృష్ణమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో విద్యార్థినులు, మహిళలపై జరుగుతున్న అన్యాయాలను ఎదుర్కోవడానికి సాయం చేసేందుకు న్యాయ సేవాధికార సంస్థలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. విద్యార్థినులు కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థానాలు పొందాలని సూచించారు. ర్యాగింగ్‌లకు పాల్పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు గృహ హింసా చట్టం, వరకట్న వేధింపుల చట్టాలు, మెయింటెనెన్స్ తదితర మహిళా చట్టాల గురించి వివరించారు. సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, హనుమకొండ కార్యదర్శి (న్యాయమూర్తి) ఉపేందర్‌రావు న్యాయ సేవాధికార సంస్థల విధులు, లక్ష్యాల గురించి వివరించారు. సదస్సులో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీకాంత్, కళాశాల ప్రిన్సిపాల్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం కృష్ణమూర్తి

## క్షేత్రపాలకుడికి ఆకుపూజ

పాలకుర్తి, డిసెంబర్ 2 : జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని పా టిమీద కొలువుదీరిన క్షేత్రపాలకుడు భక్త ఆంజనేయస్వామికి శనివారం ఆకు పూజ పర్వాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆలయ పూజారి గంగు రఘుశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచామృత అభిషేకం, చందన లేపనం, తమలపాకుల పుష్పాలంకరణ, హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ద ర్శనం అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



తమలపాకులతో పూజలందుకున్న భక్త ఆంజనేయస్వామి

## సమ్మక్క బరాజ్‌లో పెరుగుతున్న నీటిమట్టం

కన్నాయిగూడెం, డిసెంబర్ 2 : మండలంలో ని తుపాకులగూడెం సమ్మక్క బరాజ్ వద్ద నీటిమ ట్టం పెరుగుతోంది. దీంతో గోదావరి నది జలకళను సంతరించుకొని చూపరులను ఆకట్టుకుంటోంది. శనివారం రెండు గేట్లను ఎత్తి 9 వేల క్యూ సెక్కుల నీటిని దిగువకు పంపిస్తున్నారు. బరాజ్ వద్ద 80 మీటర్ల నీటి మట్టం ఉండేలా చూస్తున్న ట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు.



తుపాకులగూడెం సమ్మక్క బరాజ్ వద్ద నీటితో కళకళలాడుతున్న గోదావరి

## హేమాచలుడికి అభిషేక పూజలు

### స్వామివారిని దర్శించుకున్న మాజీ మంత్రి జలగం ప్రసాదరావు

మంగపేట, డిసెంబర్ 2 : మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహ స్వామి వారికి శనివారం అభిషేక పూజా క్రతవులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఏపీ రాష్ట్ర మాజీ మంత్రి జలగం ప్రసాదరావు స్వా మివారిని దర్శించుకున్నారు. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు గుట్టకు తరలివచ్చి గర్భగుడి ముందు జరిపిన అభిషేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకులు మాజీ మంత్రికి స్వామి వారి శేష వస్త్రాల తో పాటు తీర్థ ప్రసాదాలను అందజేశారు. పూజా కార్యక్రమాల్లో ఆయా ప్రాం తాల భక్తులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.




డబ్ల్యూజీఎల్-962 వరి పంట(ఫైల్)

## యాసంగి సాగుకు డబ్ల్యూజీఎల్ -962

### అనుకూలమైన సన్నగింజ వరి రకం

కాశీబుగ్గ, డిసెంబర్ 2 : రాష్ట్రంలో వానకాలం, యాసంగిలో వరి సాగుకు డబ్ల్యూజీఎల్ 962 అనుకూలమైన సన్న గింజ రకమని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఆర్ ఉమారెడ్డి తెలిపారు. యాసంగిలో కేవలం స్వల్పకాలిక రకాలను మాత్రమే సాగు చేసుకోవాలని సూచించారు. లేకుంటే గింజ కట్టే దశలో అధిక ఉష్ణోగ్రత వల్ల పగుళ్లు ఏర్పడి నూక అధికంగా వస్తుందని తెలిపారు. పైడిపల్లిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి 2021లో విడుదలైన వరంగల్ వరి-2(డబ్ల్యూజీఎల్ 962) యాసంగి సాగుకు అనుకూలమైన సన్నగింజ రకం అని పేర్కొన్నారు. ఇందులో నూక శాతం తక్కువగా ఉంటుందని తెలిపారు. డబ్ల్యుజీఎల్ 962 రకం మొక్కలు నిటారుగా మధ్యస్థ ఎత్తు కలిగి చేను కింద పడిపోకుండా ఉంటుందని తెలిపారు. అగ్గితెగులు, కాండం తొలుచు పురుగును కొంత వరకు తట్టుకుంటుందని పేర్కొన్నారు. వండిన తర్వాత అన్నం రుచిగా పొడిపొడిగా ఉంటుందని ఈ రకంలో గింజ రాలే గుణం ఉందడని తెలిపారు. యాసంగిలో 130-135 రోజుల పంటకాలం కలిగి 6.5-7.5టన్నుల దిగుబడిని ఇచ్చే ఈ రకం వరి విత్తనాలు వ్యవసాయ పరిశోధన స్థానంలో లభిస్తాయని డాక్టర్ ఉమారెడ్డి వివరించారు.

# 'రామప్ప'లో పర్యాటకుల సందడి

వెంకటాపూర్, డిసెంబర్ 2 : మండలంలోని రామప్ప దేవాలయం శనివారం పర్యాటకులు, విద్యార్థులు, భక్తులతో సందడిగా మారింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో పర్యాటకులు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజరులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్స్ వివరించగా పర్యాటకులు ఆసక్తిగా విన్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఆలయం ఆవరణలో ఫొటోలు, సెల్ఫీలు దిగారు. అనంతరం రామప్ప సరస్సుకు చేరుకొని బోటింగ్ చేసి ఆహ్లాదంగా గడిపారు.



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

